కనిపిస్తున్నా" వన్నాడు.

"సరేగానీ, ఓసారి మీ ప్యూన్ని పిలు..." అన్నాను.

"ఎందుకు?"

"ఇదుగో, ఈ రెండు కాగితాలూ జిరాక్సులు తీయించాలి."

"ఈ మాత్రం దానికి ప్యూనెందుకు?" అని లేచి వెళ్లి ఓ నిమిషంలోగా వచ్చేడు. "సారీ బ్రదర్. జిరాక్సు మిషన్ చెడిపోయిందిట." అన్నాడు.

"అందుకే ప్యూన్ని పిలిస్తే బైట ఎక్కడైనా చేయించుకొస్తాడని..."

బాబూరావు వాచీ చూసుకున్నాడు. "ప్యూను ఒక గంట వరకూ రాడు. మా ఇంటికి వెళ్లి కేరియర్‌తో భోజనం తెమ్మని పంపేను!" అన్నాడు.

"పోన్లే. మీ టైపిస్టుని పిలిపించు. ఈ లెటర్ రెండు కాపీలు టైప్ చెయ్యమందాం."

అదికూడా హుళక్కే అయింది.

యూనివర్శిటీలోనూ, ఆర్.టి.ఓ. ఆఫీసులోనూ, "కరెంటాఫీసు" లోనూ ఇతని పనులు చేసుకు రావడానికి వెళ్లిపోయాడు టైపిస్టు. అలా అతను తన ఇంటికి వెళ్లి భోంచేసి మధ్యాహ్నం రెండు గంటలకల్లా వస్తాడట.

"బాబూరావులు" చాలా ఆఫీసుల్లో ఉంటారు. వారందరూ జిందాబాద్!

★

# 83. మార్క్స్-ఇదమ్

ప్రహ్లాదుడికి పాఠాలు చెప్పడానికి హిరణ్యకశ్యపుడు నియమించిన చండామార్కులు ప్రహ్లాదుడికి మార్కులు వెయ్యలేకపోగా హిరణ్యకశ్యపుడి చేత మార్కులు వేయించుకోలేక పోయారుట. అదుగో అప్పట్నుంచీ ఉన్నట్టుంది ; మార్కులు సంపాదించుకోవాలనే కోరికా, దానికోసం ప్రయత్నాలూ, ఉద్యమాలూ.

నేను విశాఖపట్నంలో పామ్‌గ్రోవ్ అనే పదివాటాల సౌధంలో ఉంటున్నప్పుడు ఎమ్వీయల్ మా ఇంటికి తరుచూ వస్తూండేవాడు. ఓసారి మేం ఇద్దరం మా వాటాకున్న డాబా మీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ ఉంటే కింది నుంచి ఓ గొంతు వినబడినప్పుడు ఎమ్వీయల్ అటువేపు వంగి "హలో, శేషగిర్రావు గారూ; నమస్తే!" అన్నాడు. అట్నుంచి "నమస్తే" వినబడ్డాక ఇటు తిరిగాడు. "శేషగిర్రావు మీ పొరుగునే ఉన్నారని మీరెప్పుడూ నాకు చెప్పనేలేదు!" అని నిష్ఠూరం ఆడేడు. "ఆయన మీకు తెలుసని నాకు తెలీదు కదా..." అని సంజాయిషీ ఇచ్చుకున్నాను. "ఆయన్ని నాకు తెలీకపోవడమేమిటి? పైగా ఈ మధ్యనే మార్క్సిస్టు అయ్యాడు కదా..." అన్నాడు ఎమ్వీయల్. నేను నిర్ఘాంతపోయాను. "ఛా ఛా, ఆయన అలాటి వాడు కాదండీ... పైగా ఈ మధ్య ఆయన లెక్చర్ టూర్‌మీద వెళ్లింది వెస్టు జర్మనీకే గాని ఈస్టు జర్మనీకి కాదు." అన్నాను.

"అదేనండి బాబూ, నేను అంటూంట. ఏడాది పాటు వెస్టు జర్మనీలో లెక్చర్ టూర్లు చేసి బాగా "మార్కులు" సంపాదించుకొచ్చేడు" అని ఎమ్వీయల్ ఆ అట్టు తిరగేశాడు.

ఎమ్వీయల్ ఆంధ్రా యూనివర్సిటీ వారి ఎటిమలాజికల్ డిక్షనరీ (వ్యుత్పత్తి అర్థాల నిఘంటు) ప్రాజెక్టులో పని చేస్తున్నప్పుడు బాలసుందరం అని ఓ అబ్బాయి తెలుగెమ్మేలో ఉండేవాడు. అతను స్టూడెంట్సు యూనియన్ లీడరు. డేస్కాలర్స్‌కీ, హాస్టలైట్స్‌కీ ఎక్కడైనా చిన్న అన్యాయమో, అపచారమో జరిగితే ఈ బాలసుందరం క్షణాలమీద మీటింగు ఏర్పాటు చేసి విద్యార్థులనీ (విద్యార్థినులనీ) కూడగట్టుకుని ("ఆ" కట్టుకుని) యూనివర్సిటీ అధికారుల జులుం నశించాలంటూ తీవ్రమైన ఉపన్యాసాలిచ్చేసేవాడు. ప్రీవియస్ (ఫస్ట్ ఇయర్) పరీక్షల్లో ఏదో ఒక పేపరు పాడుచేస్తే; ఎక్స్‌టర్నల్‌కీ, ఇంటర్నల్‌కీ పెద్ద తేడా రాకుండా చూసుకుందికి "తిరుపతి వెళ్లి ప్రొఫెసర్ జి.ఎన్.రెడ్డి గార్ని ఆశ్రయించమని" అతనికి ఎవరో సలహా ఇచ్చారు. వెళ్లాడో లేదో తెలీదు గాని అతను పాడుచేసేనని అందరికీ చెప్పి కన్నీళ్లు పెట్టుకున్న పేపర్లో అతనికి యాభై తొమ్మిది పర్సెంట్ వచ్చింది. "జీయన్రెడ్డి గారు ఇలాంటి ఆశ్రయింపులకి లొంగే ఘటం కాదే. ఇదెలా సాధ్యమైందో?" అని నేను ఎమ్వీయల్‌ని అడిగాను. "ఇతను ఓ రకం మార్క్సిస్టు ; వీళ్లమ్మగారు ఇంకోరకం "మార్క్సిస్టు" అన్నాడు ఎమ్వీయల్.

(బాలసుందరం సెలవులకి ఇంటికి వెళ్లేడు. పరీక్షలు ఎలా రాసేవని వాళ్ల అమ్మా, నాన్నాలడిగేరు. ఫలానా పేపరు పాడుచేసేనని ఇతనన్నాడు. వాళ్లమ్మగారు ఇతని నెంబర్ నోట్ చేసుకొని తిరుపతి వెళ్లి స్వామికి మనవి చేసేరు. మార్క్సిస్టుల్లో కూడా మహాభక్తులుండొచ్చునన్న జ్యేష్ఠగారి సూక్తి(!) ఫలితంగా బాలసుందరానికి ఆ పేపర్లో ఎక్స్‌టర్నల్ మార్కులు అరవై ఏడు వచ్చాయి.... ఇంటర్నల్ మార్కుల గురించి అంతకి ముందే శ్రద్ధ తీసుకోవడం జరిగింది కదా.)

అమెరికాలో ఓ కాలేజీలో చదివిన ఒక స్టూడెంటుకి అన్ని సబ్జెక్టులలోనూ నూటికి నూరు మార్కుల చొప్పున వచ్చాయి కానీ ఒక దాంట్లో తొంభై తొమ్మిదే వచ్చాయటు. ఆ మేష్టారు ఆ అబ్బాయిని పిలిచి "ఎందుకిలా జరిగింది?" అని గద్దించాడట. అప్పుడా అబ్బాయి భయపడుతూ "నేను ఒక్కసారి మీ క్లాసుకి వచ్చానండి" అన్నాడట. (ఈ జోక్ కూడా జ్యేష్ఠ గారే చెప్పేరు.) మన దేశంలో అయితే "నేను తమ క్లాసు ఒకటి మిస్సయ్యానండి" అని కదా వస్తుంది, సంజాయిషీ!

మేం విజయనగరం కాలేజీ హైస్కూల్లో చదువుకునేటప్పుడు గజవల్లి చిదంబరరావుగారని, మాకో సైన్సు మేష్టారుండేవారు. ఆయనెప్పుడూ పంచె, డబల్ కఫ్స్‌ఫుల్‌చేతుల షర్టు, కోటు వేసుకొచ్చేవారు. చాలా సీరియస్‌గా ఉండేవారు. క్లాసుకొచ్చినా, క్లబ్‌కెళ్లినా, ఆఖరికి కోవెల్లోకెళ్లినా అల్లంత దూరానికి సువాసన విరజిమ్మే రకం "సెంటు" రాసుకునే వచ్చేవారు; వెళ్లేవారు. మా క్లాసులో పట్టభళ్ల నరిసింగరావని మాంచి దూకుడైన వాడు ఒకడుండేవాడు. పదోక్లాసు (అప్పుడు ఫిఫ్త్ ఫారం) హాఫియర్లీ పరీక్షల ఆన్సర్ పేపర్లు వెనక్కి ఇచ్చేసిన రోజున చిదంబర రావు మేష్టారు మా నరసింగరావుని మందలించే ధోరణిలో - "నీకు ఇంగ్లీషులో ఫస్ట్ మార్కొచ్చింది. తెలుగులో వచ్చింది. ఆఖరికి హిస్టరీ, జాగర్ఫీల్లో కూడా మంచి మార్కులే వచ్చాయిట. నా సబ్జెక్టులో

మాత్రం నూటికి నలభై అయిదు మార్కులే వచ్చాయి. సైన్స్ అంటే అశ్రద్ధ పనికిరాదు, నర్సింగరావ్! అన్నట్టు నీకు లెక్కల్లో ఎన్ని మార్కులొచ్చేయి?-" అన్నారు.

మా నరిసింగరావు తన ఆన్సర్ పేపరు అందుకోడానికి మేష్టారి దగ్గరికి వెళ్లేడు కదా. మేష్టారి మీదికి వంగి వాసన చూసినంత తీక్షణంగా గాలి పీల్చి; "సెంటుపర్... సెంటు సార్" అన్నాడు. మేష్టారికి అర్థమై, పేపర్ల కట్ట టేబిలు మీద కొట్టి "సైలెన్స్" అనే లోపుగా; మేం అందరం నవ్వేశాం.

నేను బి.ఏ. ఫైనలియర్‌లో ఉన్నప్పుడు "కవి పాదుషా" పువ్వాడ శేషగిరిరావు గారు మాకు తెలుగు చెప్పేవారు. డిసెంబరులో జరిగిన హాఫియర్లీ పరీక్షల ఆన్సర్ పేపర్లు జనవరిలో పండుగ సెలవులయ్యేక ఇచ్చిననాడు; శేషగిరిరావు మేష్టారు క్లాసులోకి వస్తూనే ఆన్సర్ పేపర్ల బొత్తిని టేబిలు మీద ఎత్తికొట్టేరు. మాస్టారు క్లాస్ రూంలోకి వచ్చిన సందర్భంగా ఆయన గౌరవార్థం నిలబడిన మేం సీట్లలో కూర్చోకముందే ఆయన; "నేను ఈ ఉద్యోగానికి రాజీనామా ఇస్తున్నాను!" అన్నారు.

మాక్లాసులో అందరం 18-20 వయసు వాళ్లమే కాని వాసుదేవరావు అనే ఒకాయన సుమారు 30 ఏళ్లవాడుండేవాడు. మాష్టారి మాటలకి అతను అందర్లాగా నిర్ఘాంతపడి ఊరుకోకుండా "ఒద్దుసార్; తొందర పడకండి మేష్టారూ, బందర్లో బాగాలేదని అక్కడ రిజైన్ చేసి వచ్చారు. ఇక్కడా రిజైన్ చేస్తే-" అని ఏదో అనబోయాడు.

శేషగిరిరావు మేష్టారు గుడ్లెర్రచేసి నా వేపు వేలు చూపించేరు. "రామగోపాలానికి తెలుగులో తొమ్మిది మార్కులొచ్చేయి. నేనింకా ఈ ఉద్యోగం ఏ మొహం పెట్టుకు చెయ్యాలి?" అన్నారు.

క్లాసంతా నన్ను చిరాకుతో , సానుభూతితో చూసేరు. "క్లాసయిపోయాక నువ్వు నా కూడా వచ్చి క్షమాపణ చెప్పుకో" అని మేష్టారి తర్జని నాకు చెప్పింది.

అది "ఓల్డ్‌పొయిట్రీ" పేపరు. ఆ పరీక్ష డిసెంబరు 15 నాడు జరిగింది. యూనివర్సిటీకి ఎగ్జామినేషన్ ఫీజు కట్టడానికి అదే ఆఖరి రోజు. అది 1950. ఆ ఫీజు 55 రూపాయలు. అంతకి రెండు నెలల ముందు నుంచీ గింజుకుంటున్నా మానాన్నగారు ఆ వేళకి 55 రూపాయలు పోగు చెయ్యలేక పోయారు. 14 సాయంకాలం బియ్యం అరువు మీద కొనడానికి ఆయన బత్తుల వజ్రంగారి దుకాణానికి వెళ్లి ఎగ్జాం ఫీజులో కొరదలా పడిన అయిదు రూపాయల సంగతి చెప్పేరు. "ఆ అయిదూ నేనిస్తాను గాని; ఇప్పుడు దీపాలు పెట్టేశాం గనక; అబ్బాయిని రేపు తొమ్మిది గంటలకి పంపండి" అన్నారు వజ్రంగారు. 15 ఉదయం ఎనిమిది గంటలకి పరీక్ష మొదలయింది. అరగంటలోపుగా ఎవరూ పరీక్ష హాల్లోంచి బైటికి వెళ్లిపోకూడదు. అంచేత 8-45 దాకా రాసి, పేపరు మడత పెట్టి ఇచ్చేసి, వజ్రంగారి దగ్గరికి పరుగెత్తాను.

ఇదంతా నేను కళ్లనీళ్లు పెట్టుకుని మాస్టారికి చెప్పేను. మాస్టారు తన కళ్లు తుడుచుకుని, జేబులోంచి ఐదు రూపాయలు తీసి ఇచ్చి "వెంటనే ఆ బాకీ తీర్చెయ్యి" అన్నారు.

★